# 4

# మనం అశ్రద్ధగా ఉంటున్నామా?

## (2:1-4)

హెబ్రీయులకు 2:1-4లో మనకు మొదటి "ప్రోత్సాహకర మాటలు" ఇవ్వబడ్డాయి. ఈ సందేశమును యిలా చెప్తున్నాను: *వాక్యముతో నిర్లక్ష్యముగా ఉండవద్దు!*

"కావున" అన్న మాటతో ఈ అధ్యాయం ప్రారంభమవుతుంది. అంటే, ఇంతకు ముందు చెప్పబడిన విషయంతో ఇది సంబంధం కలిగియుంది. యేసు దేవుని కుమారుడు *కాబట్టి*, ఆయన ఆరాధించబడాలి *కాబట్టి*, ఆయన సమస్తమును సృజించాడు కాబట్టి, ఆయన అందరి మీదను రాజ్యము చేస్తున్నాడు కాబట్టి, "మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెను" (1 వ.). 3వ వచనంలో "నిర్లక్ష్యం" అన్న మాటను చూస్తున్నాము. "కొట్టుకొని పోవడం" మరియు "నిర్లక్ష్యం" అనునవి అశ్రద్ధను సూచిస్తున్నాయి; ఈ రెండు విషయాలను వివరించుటకు నేను "అశ్రద్ధ" అను పదాన్ని వాడుతున్నాను. వాక్యముతోను, క్రైస్తవ్యంతోను, మన ఆత్మలతోను నిర్లక్ష్యంగా, అశ్రద్ధగా ఉండడం మనం విడిచిపెట్టాలి.

### పాపము

ఈ పత్రిక ఎవరినుద్దేశించి వ్రాయబడిందో వారు తమ క్రైస్తవ జీవితమును ఎంతో ఉత్సాహముగా ఆరంభించారు కాని వారు తర్వాత విశ్వాసమును విడిచిపెట్టే ప్రమాదంలో ఉన్నారు అని మనం ప్రారంభ పాఠంలోనే చూశాము. వారు క్రైస్తవ్యమును విడిచిపెట్టుటకు తామేం చేస్తున్నామో ఎరిగే ఈ నిర్ణయం తీసుకున్నారా లేక ఒక రోజున కోపగించుకుని వదిలివేశారా అన్నది చెప్పే సూచనలు మనకు లేవు. అలాగాక వారు లంగరు[1] లేని పడవ సముద్రంలో కొట్టుకుపోయినట్లు వారు *కొట్టుకుపోతున్నారు*. ఇన్ని సంవత్సరాల కాలంలో ఎంతోమంది విశ్వాస భ్రష్టులవడం నేను చూశాను.[2] కొంతమంది నిరాశ చేత విడిచి పెట్టగా, ఎక్కువమంది అశ్రద్ధవలన విశ్వాస భ్రష్టులయ్యారు. వారు కొట్టుకు పోయారు. 3వ వచనంలోని మాటనుపయోగించి చెప్పాలంటే, ఆత్మను కాపాడేదాన్ని *నిర్లక్ష్యపెట్టారు*.

లూకా 15లోని తప్పిపోయిన ఉపమానాల్లో గొఱ్ఱె తప్పిపోవడం మొదటిది. లెక్క ప్రకారం గొఱ్ఱె హేయమైనది కాదు. కాపరి మీద కోపంతో అది తప్పిపోదు. అలాగాక ఇది పచ్చిక బయళ్ళలో మేస్తూ అలా వెళ్ళి, ఆఖరికి అది తలెత్తి చూసేసరికి మిగిలిన గొఱ్ఱెలకు దూరంగా వెళ్ళిపోయుంటుంది. అలా తప్పిపోయింది!

ఈ దినాల్లో తప్పిపోవడం, కొట్టుకుపోవడం, నిర్లక్ష్యం చేయడం, అశ్రద్ధచేయడం గురించిన నవీన ఉదాహరణలను ఇవ్వవచ్చు. వాటి యొక్క పర్యవసానం విషాదాంతముగా ఉన్నది.[3] జీవిత భాగస్వాముల్లో ఒకరు లేదా ఇద్దరూ బంధాన్ని నిర్లక్ష్యం చేయడం వలన వివాహ సంబంధ నాశనం కాబడుతుంది. వివాహ బంధంలో తమ జీవిత భాగస్వామి పట్ల అవిశ్వాసముగా ఉండువారు కావాలని పథకం ప్రకారం అలా చేయరు. అశ్రద్ధ చేయడం

ద్వారా, అనైతిక సంబంధాలలో కొట్టుకుపోతారు.

విశ్వాసంనుండి తొలగిపోయిన అనేకమంది నాకు తెలిసినవారు ఉద్దేశపూర్వకంగానో, బుద్ధిపూర్వకంగా కోరుకొనో విడిచి పెట్టలేదు గాని, నిర్లక్ష్యం వలన, అశ్రద్ధ వలన వారు తొలగిపోయారు. వీరిలో అనేకమంది తమ క్రైస్తవ జీవితమును ఉత్సాహముగా ఆరంభించారు. అయితే రానురాను వారు తమ "మొదటి ప్రేమను" విడిచి పెట్టారు (ప్రకటన 2:4). వారింతకు ముందు వాక్యం చదివినట్లు ఇప్పుడు చదువుటలేదు. ఇంతకు ముందులా ప్రార్థన చేయడం లేదు. కొన్ని ఆరాధనా సమయాలను ఎగ్గొడుతూ వచ్చారు. మునుపటిలా దేవుని సేవలో ఉత్సాహంగా లేరు. వారు నెమ్మదిగా ... నెమ్మదిగా ... నెమ్మదిగా కొట్టుకుపోతూ ... కొట్టుకుపోతూ – దేవునినుండి దూరమైపోయారు.

### ప్రాముఖ్యత

దేవునినుండి నెమ్మదిగా తొలగిపోవడం, ఆయన చిత్తమును నిర్లక్ష్యం చేయడం వంటి వాటిని అవిధేయతతో పోలిస్తే మనల్ను అంతగా ఆశ్చర్యపర్చకపోవచ్చు గాని అంతిమ ఫలితం మాత్రం ఒకేలా ఉంటుంది. నిర్లక్ష్య వైఖరి యొక్క పర్యవసానం ఉద్దేశపూర్వక కార్యమువలె ఉందనుటకు కొన్ని ఉదాహరణలను ఇవ్వవచ్చు. కొన్ని సంవత్సరాల క్రితం, మా మేనల్లుడి ఇంటి ప్రక్కన ఉండే ఇంటి యజమానురాలు కొన్ని మానసిక సమస్యలతో బాధపడుతూ, తెలియక తన చిన్న బిడ్డను చంపివేసింది. అదే సంవత్సరం, మాకు తెలిసిన ఒకామె తన బిడ్డను వదిలేసి నిద్రపోవడం వలన ఆ బిడ్డ నీళ్ళలో మునిగి చనిపోయింది. ఒక మరణం మానసిక అస్థిరతలోనున్న వ్యక్తి ఉద్దేశపూర్వకంగా చేసిన పనికాగా, మరొక మరణం నిర్లక్ష్యం వలనైనది. కాని రెండింటిలోను ఫలితం ఒక్కటే: శిశు మరణ విషాదం.

### క్రీస్తు వాక్యముతో అశ్రద్ధగా ఉండడం

మన వాక్య భాగములో *సువార్త* విషయంలో అశ్రద్ధ కలిగియుండడం అన్న విషయం ప్రత్యేకంగా చెప్పబడింది. ఇది విషాదకరం, మొదటిగా ఎందుకంటే ఇది *క్రీస్తు* వాక్యము. "దేవదూతల ద్వారా చెప్పబడిన వాక్యము" (2 వ.; చూడు అపొస్తలుల కార్యములు 7:53; గలతీయులకు 3:19) (పాత నిబంధన) మరియు "ప్రభువు యొక్క మాట" (3 వ.) (క్రొత్త నిబంధన) మధ్య వ్యత్యాసాన్ని గ్రంథకర్త చెప్తున్నాడు.

"దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున, ప్రతి అతిక్రమమును, అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియున్నది" (2 వ.). సబ్బాతు దినమున కట్టెలు ఏరుకున్న వ్యక్తిని రాళ్ళతో కొట్టి చంపాలి (సంఖ్యాకాండము 15:32–36). ఉజ్జా నిబంధన మందసమును ముట్టుకున్నప్పుడు అతడు చంపబడ్డాడు (2 సమూయేలు 6:3–7). దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యమునకు అంత కఠినమైన నిబంధన, శిక్షలు ఉంటే, "ప్రభువు ద్వారా పలుకబడిన" గొప్ప రక్షణను[4] నిర్లక్ష్యం చేసినవారికి మరి ఎంత ఘోర ఫలితం ఉంటుందోనని గ్రంథకర్త విస్మయమొందుతున్నాడు (3 వ.)?

### "గ్యారంటీ" చేయబడిన సువార్త విషయంలో అశ్రద్ధగా ఉండుట

రెండవదిగా, సూవార్త విషయంలో అశ్రద్ధగా ఉండడం విషాదకరం. ఎందుకంటే, ఇది

*"గ్యారంటీ"* చేయబడిన సువార్త. ఇది "మనకు *దృఢపరచబడెను*" (3 వ.) అని గ్రంథకర్త నిశ్చయపరుస్తున్నాడు. ప్రభువు చేత బోధింపబడిన వాక్యంను సూచిస్తూ William Barclay, "గ్యారంటీ" అనే పదాన్ని వాడుతున్నాడు.[5] మనం గ్యారంటీ ఉన్న వస్తువులనే కొనడానికి ప్రయత్నింస్తుంటాము. ఎందుకంటే అవి మనలో నమ్మకం కలిగిస్తాయి. దేవుడే సువార్త విషయంలో గ్యారంటీ చెప్తుంటే; మన నిత్య ఆత్మలను దాని బోధనకు సిద్ధముగా అప్పగించుకోవచ్చు.

సువార్త ప్రామాణికత గురించి మన వాక్యభాగం మూడు సాక్షులను అందిస్తుంది.

- యేసు: "ఇది ప్రభువు బోధించుట చేత ఆరంభమై"నది (3 వ.).
- అపొస్తలులు మరియు ఇతర దైవప్రేరేపిత బోధకులు: "వినినవారి చేత మనకు దృఢపర్చబడింది" (4 వ.).
- దేవుడు: అపొస్తలుల మరియు ఇతరుల[6] చేత జరిగించిన మహాత్కార్యముల ద్వారా: "దేవుడు తన చిత్తానుసారముగా సూచకక్రియలచేతను, మహత్కార్యముల చేతను, నానావిధములైన అద్భుతములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుటచేతను, వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినినవారిచేత మనకు దృఢపరచబడెను" (4 వ.).[7]

క్రీస్తు యొక్క వాక్యమును నిర్లక్ష్యం చేసినట్లయితే, మనకు అది ఎంత విషాదకరము! గ్యారంటీ చేయబడిన సువార్త నుండి క్రైస్తవులు కొట్టుకు పోయినట్లయితే ఎంత విషాదకరం!

## పరిష్కారము

కొట్టుకొని పోకుండుటకు మనం ఏం చేయాలి? అశ్రద్ధ అనే పాపంనుండి మనల్ను మనం ఎలా కాపాడుకోవాలి? మన వాక్య భాగం ప్రారంభమునకు తిరిగి వెళ్దాము: "కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొనిపోకుండునట్లు వాటియందు మరి *విశేష జాగ్రత్త* కలిగియుండవలెను" (1 వ.; నొక్కి చెప్పింది నాది). Neil R. Lightfoot యిలా వ్రాస్తున్నాడు,

> వారు ఆరాధనకు సంఘమునకు వచ్చునప్పుడు దేవుని వాక్యం విశేష ఆసక్తితో వినుటకు ముందుకు వంగి తమ కుర్చీల అంచుల మీద కూర్చోవాలి (చూడు యాకోబు 2:2), అయితే మీరు, నేను క్లాసుకు, సంఘానికి వచ్చినప్పుడు సగం మనస్సుతో వస్తాము, శారీరకంగాను, మానసికంగాను మాత్రమే ఉంటారు. ఆత్మీయ విషయాలు, నిత్య విషయాలులో మనం తీవ్రతకలిగి యుండాలి.[8]

మనం వాక్యాన్ని చదవాలి. దాన్ని ధ్యానంచేసి తరచూ మననం చేసుకుంటుంటే దానినుండి మనం యిక తొలగిపోము.[9] చివరిగా, వాక్యాన్ని మనం ఆచరణలో పెట్టాలి.

దేవుడు లేకుండా మనం దీన్ని చేయలేము. మనకు సహాయం చేస్తానని ఆయన వాగ్దానం చేసినందుకు మనం ఆయనకు ఎంతో కృతజ్ఞులమైయుండాలి (1:17, 18; చూడు 4:14–16; 13:5బి, 6). మనం ఏం చేయగలమో దాన్ని చేయుటకు దేవుడు కోరుతున్నాడు. వ్యక్తిగత బాధ్యతనుండి మనం తప్పించుకోలేము. నమ్మకస్తులమై ఉండుటకు, దేవుని "గొప్ప

రక్షణను" ఆశించి దాని నిమిత్తం ప్రయాసపడాలి.

---

### ఉపదేశకులకు సూచనలు

"కొట్టుకొని పోవుట" అను మాటకు బదులు 2:1 KJVలో "జారిపోవడం" అని ఇయ్యబడింది. "జారిపోవకుండునట్లు మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెను." నేను బరువు తగ్గినప్పుడు నా పెళ్ళినాటి ఉంగరం నా వ్రేలికి వదులవుతుంటుంది. నేను ఆస్ట్రేలియాలో ఉన్నప్పుడు నా ఉంగరం కొన్ని నెలల పాటు కనబడకుండా పోయింది. తర్వాత పాలవాడు పాలు ఉంచే చెట్టు క్రింద నాకు దొరికిందది. ఒక రోజు, పాల డబ్బాల కోసం వంగినప్పుడు అది నా వ్రేలినుండి జారిపోయుంటుంది. కోపంతో, కక్షతో, నా ఉంగరాన్ని నేను విసిరివేయలేదు; అది జారిపోయింది. అలాగే కొంతమంది తమ విశ్వాసమును, సమర్పణను, దేవునితో తమ సంబంధాన్ని అలాగే జార విడుస్తుంటారు.

*నిర్లక్ష్యంగా వదిలి వేయబడిన అవకాశాలు* మరి ఎన్నడూ రావు అని నీవు నొక్కి చెప్పవలసివుంది. "మూడు విషయాలు వెనక్కు రావు – పలుకబడిన మాట, వేయబడిన బాణం, కోల్పోయిన అవకాశం" అని ఒక పాత సామెత చెప్పుతుంది.

---

సూచనలు

[1]నిరీక్షణ అనే ఆత్మీయ లంగరు గురించి హెబ్రీ పత్రిక తర్వాత భాగం మాట్లాడుతుంది (6:19). [2]"విశ్వాసం" అనేది దేవునికి చూపించే విధేయతగా క్రైస్తవులలో చూస్తున్నాము (చూడు అపొస్తలుల కార్యములు 14:22; 16:5; 1 కొరింథీయులకు 16:13). [3]ఇక్కడ రెండు ఉదాహరణలనిచ్చాను. మీరున్న ప్రాంతానికి సరిపోయే ఉదాహరణలివ్వండి. [4]"యేసు ఎందుకు మనవలె అయ్యాడు" అన్న తరువాత పాఠంలో "గొప్ప రక్షణ" గురించి నేర్చుకుంటాము. [5]William Barclay, *The Letter to the Hebrews*, 3d ed., rev. and updated, The New Daily Study Bible (Louisville: Westminster John Knox Press, 2002), 24. [6]"ఇతరులు" అంటే, అపొస్తలుల చేతులు తమ మీద నుంచబడినవారు (చూడు అపొస్తలుల కార్యములు 8:17, 18). [7]సూచక క్రియల ఉద్దేశం వాక్యమును నిశ్చయపర్చడం, ఒకసారి ఇది నిశ్చయపర్చబడిన తరువాత, ఇది అలాగే కొనసాగుతుంది. [8]Neil R. Lightfoot, ACU extension class on Hebrews taught in Fort Worth, Texas, 14 September 1985. [9]ఒక వ్యక్తి జ్ఞాపకాల్లోంచి జారిపోయిన ఉదాహరణ నొకటి చెప్పండి.